

జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్, కార్పొరేటర్ మహేశ్వరి తదితరులు



జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకురాలు కోట నీలిమ తదితరులు



ఫిలింనగర్ మహనీయుల విగ్రహాల చౌరస్తాలో నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి



నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి తదితరులు



నివాళులర్పిస్తున్న ఫిలింనగర్ 18 బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, కాటూరి రమేష్ తదితరులు

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

బేగంపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గొప్ప సంఘ సంస్కర్త, రాజకీయ వేత్త బాబూ జగ్జీవన్ రామ్ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డ ఎన్‌బీటీనగర్‌లో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో తలసాని పాల్గొని జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లో జరిగిన జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్ పాల్గొని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని నివాళులర్పించారు.

ఎర్రగడ్డలో..

ఎర్రగడ్డ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ దళిత జాతికి చేసినసేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములునాయక్ కొనియాడారు. ప్రేమ్‌నగర్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోతురాజు నర్సింగ్‌రావు, గంటా మల్లేష్, యాకమ్మ, రాజమణి, రమేష్ నాయక్, కాసిం అలీ, గంటా శ్రీనివాస్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎర్రగడ్డలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగ్ రావు, దాసి శ్రీకాంత్, రొంపి బాలకృష్ణ, గంటా కృష్ణ, తరుణ్, రఘు, తుకారం, చందు, విజయ్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ జగ్జీవన్ రామ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్ర కృష్ణకుమార్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పలువురు దళిత నాయకులు నివాళులర్పించారు.



ఎర్రగడ్డలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు సంజీవ తదితరులు



ఎల్లారెడ్డిగూడలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకుడు అంతారం శాంతికుమార్, పత్తి హరీష్‌యాదవ్ తదితరులు



నివాళులర్పిస్తున్న బేగంపేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎర్ర కృష్ణకుమార్, మొహమ్మద్ మోసిన్ ఖురేషి తదితరులు

ఎస్పీఆర్ హిల్స్‌లో..



ఎస్పీఆర్ హిల్స్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్ రెడ్డి

బోరబండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్ల పరిధిలో వివిధ పార్టీల నాయకులు శనివారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ రెండు బొమ్మల కూడలిలోని అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి నివాళులర్పించారు. పార్టీ నాయకులు కొలన్ సత్యనారాయణ, కుంబాల గంగరాజు, రహ్మత్‌నగర్, బోరబండ డివిజన్ల అధ్యక్షులు తంగేళ్లపల్లి లక్ష్మణ్, కొత్త వెంకటేష్, ఎస్.మల్లేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ బస్తీలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు

బోరబండలో..



బోరబండ బస్టాప్ వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

డాక్టర్ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బోరబండ బస్టాప్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఆనంద్, చెట్టి దేవేందర్, బాలరాజ్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, కాసుల మహేష్ గౌడ్, జైభీమ్ యాదగిరి, మున్నా తదితరులు పాల్గొన్నారు.

రహ్మత్‌నగర్ కూడలిలో..



రహ్మత్‌నగర్ కూడలిలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తదితరులు

రహ్మత్‌నగర్ కూడలి, ఎస్పీఆర్ హిల్స్ రెండు బొమ్మల కూడలిలోని జగ్జీవన్ విగ్రహాలకు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి నివాళులర్పించారు. డివిజన్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి గ్యార నాగరాజు సీనియర్ నాయకులు డి.యాదగిరి, సువర్ణమ్మ తదితరులు నివాళులర్పించారు.



కార్యక్రమంలో పాల్గొన్న గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, జగన్ ముదిరాజ్ తదితరులు

గిరీష్‌ముదిరాజ్ కుటుంబంపై దాడిని ఖండిస్తున్నాం

- ముదిరాజ్ ఐక్యవేదిక కన్వీనర్ గుండ్లపల్లి శ్రీను

పంజాగుట్ట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ ఛానెల్ నిర్వాహకుడు దారమోని గిరీష్‌ముదిరాజ్, అతని కుటుంబ సభ్యులపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని తెలంగాణ ముదిరాజ్ ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ పేరు చెప్పి దాడి చేసినట్లు బాధితులు చెబుతున్నారని, దీనిపై మంత్రి స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేదిక నాయకులు అల్లుడు జగన్ ముదిరాజ్, ముదిరాజ్ సంక్షేమ సమితి అధ్యక్షుడు అల్లాదుర్గం సురేష్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. గత నెల 29 నుంచి గిరీష్ ముదిరాజ్, అతని కుటుంబంపై వరుసగా దాడులు జరుగుతున్నాయని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. గిరీష్‌ను చంపివేస్తామని బెదిరిస్తున్నారని, ప్రభుత్వం స్పందించి బాధితుడికి రక్షణ కల్పించాలని కోరారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గిరీష్ మెడలో చెప్పుల దండ వేసి కొట్టారని, అతని తల్లి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కున్నారని ఆరోపించారు. దాడి ఘటనపై గవర్నర్, డీజీపీలను కలుస్తామని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో వేదిక నాయకులు అంబర్ పేట సతీష్ ముదిరాజ్, అనంద్ ముదిరాజ్, రాకేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

బోరబండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆదేశాల మేరకు సైట్-2 కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి అశోక్ వారి మెడలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పట్ల ఆకర్షితులవుతున్నారని అశోక్ పేర్కొన్నారు. యూసుఫ్, ముంతాజ్ బేగం, తహసీన్ బేగం, బి.ఈశ్వరమ్మ, బి.సురేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసుల మహేష్ గౌడ్, సయ్యద్ ఖయ్యూమ్, ఖలీల్, మున్నా, గోపాల్ రెడ్డి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఓఎల్ఎక్స్‌లో ఏసీ అమ్ముతానంటూ మోసం

బోరబండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఓఎల్ఎక్స్ ద్వారా ఏసీ కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిని మోసం చేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంకుపట్టి సీన అనే వ్యక్తి సెకండ్ హ్యాండ్ ఏసీ కొనుగోలు చేసేందుకు ఓఎల్ఎక్స్‌లో వెతికాడు. తన వద్ద ఏసీ ఉందంటూ ఓ వ్యక్తి మెసేజ్ పంపించాడు. ఫోన్ పే ద్వారా డబ్బులు పంపమని కోరడంతో రెండు విడతలుగా రూ.12వేలు పంపించాడు. ఆ తర్వాత అవతలి వ్యక్తి స్పందించడం మానేశాడు. దీంతో మోసపోయినట్లు నగ్రహించిన బాధితుడు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కంట్రీ రిసార్ట్స్ వద్ద అసోసియేషన్ సభ్యులు

కంట్రీ రిసార్ట్స్‌ను సందర్శించిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం హిమాయత్ సాగర్ సమీపంలోని కంట్రీ రిసార్ట్స్‌ను సందర్శించారు. రోజువారి అలసట నుంచి విరామంగా, ప్రకృతి ఒడిలో గడిపేందుకు ఏర్పాటు చేసిన ఈ పర్యటన సభ్యులకు మంచి ఊరట కలిగించింది. పచ్చదనంతో అలరించే రిసార్ట్ ప్రాంగణంలో సభ్యులు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా సంఘం తరఫున పలు వినోదాత్మక ఆటలు, సమూహ కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో సభ్యులు ఉత్సాహంగా పాల్గొని తమ చురుకుదనాన్ని చాటుకున్నారు.

చేవెళ్ల డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘాల ఐక్యవేదిక నేతల డిమాండ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇందిరమ్మ రాజ్యం.. ఇంటింటా సౌభాగ్యం పేరిట ఆదివాసీ గిరిజనులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ ప్రతినిధులు ఆరోపించారు. శనివారం కమిటీ ప్రతినిధులు నెక్లెస్‌రోడ్ రోటరీ చౌరస్తాలోని ఇందిరా గాంధీ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక చైర్మన్ రూప్‌సింగ్, వైస్ చైర్మన్ లోకిని రాజు మాట్లాడుతూ.. చేవెళ్ల డిక్లరేషన్‌లో గిరిజనులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నేతలు మర్చిపోయారని విమర్శించారు. ప్రతి గిరిజన కుటుంబానికి 12 లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. నల్గొండ, మహబూబాబాద్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలో ఐటీడీఏలు వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ, లంబాడీ, ఏకలవ్య కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి ఒక్కోదానికి రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. గిరిజన విద్యార్థులకు ఆర్థిక సాయం హామీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి గూడెం, తండా పంచాయతీలకు ఏటా 25 లక్షల రూపాయలు విడుదల చేయాలన్నారు. తమకిచ్చిన 9 హామీలను ప్రభుత్వం నెరవేర్చేలా చూడాలని ఇందిరా గాంధీకి వినతి పత్రం అందజేసినట్లు వారు వెల్లడించారు. వెంటనే హామీలను అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆత్రం యాదగిరి, ఇరాహూరి రామకృష్ణ, కాలియా ప్రకాష్, రవికుమార్, రాములు నాయక్, రనావత్ మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

మున్నూరుకాపు జనాభాను తగ్గించి చూపారు

- మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య పటేల్

పంజాగుట్ట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కులగణనలో రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా మున్నూరుకాపుల జనాభాను తగ్గించిందని తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ ఆరోపించారు. పటేల్ యూత్ ఫోర్స్ ద్వితీయ వార్షికోత్సవ సభ శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడకముందే మున్నూరుకాపుల జనాభా 40లక్షలకు పైగా ఉందని, ప్రస్తుతం 50లక్షలకు పైగా ఉంటుందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో తమ జనాభా కేవలం 13 లక్షలు మాత్రమే ఉన్నట్లు చూపించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కులగణనలో తమకు న్యాయం జరిగిందని, మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ, కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయన్నారు. కోకాపేటలో రూ.500 కోట్ల విలువైన 5 ఎకరాల భూమిని కేటాయించి ఆత్మగౌరవ భవన నిర్మాణం చేపట్టిందని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మున్నూరుకాపులపై దాడులు పెరిగాయని, రాజకీయంగా అణచివేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధభేరి ప్రకటిస్తున్నామని, మే నెలలో పది లక్షల మందితో పరేడ్ గ్రౌండ్‌లో మున్నూరుకాపు గర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు గర్జన సన్నాహక కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్లు కొత్త లక్ష్మణ్ పటేల్, చందు జనార్దన్ పటేల్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎల్.వేణుగోపాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండ దేవయ్య పటేల్

రోడ్డుపైనే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్

- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు తలెత్తినప్పుడు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు తర్వాత వాటిని పట్టించుకోవడం లేదు. యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌లో ఓ రోడ్డులో మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి నాలుగు రోజులవుతున్నా అక్కడి నుంచి తీయకపోవడంతో రోడ్డుపై వెళ్తున్న వారికి ప్రమాదంగా మారింది. ఆ రోడ్డు మార్గంలో ఓ ప్రైవేట్ స్కూల్ ఉండటంతో విద్యార్థులు ట్రాన్స్‌ఫార్మర్ల పక్కనుంచే వెళ్లాల్సి ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మించే భవనాలకు ట్రాన్స్‌ఫార్మర్ లేకుండానే ఇష్టానుసారంగా విద్యుత్ కనెక్షన్లు జారీచేయడంతో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ పడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్య తలెత్తినప్పుడు తాత్కాలికంగా ఏర్పాటు చేసే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రెండు రోజులుగా వర్షాలు పడుతున్నాయని, వర్షం పడినప్పుడు రోడ్డు మీద వెళ్లే వాహనదారులు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని భయపడుతున్నారు.



కృష్ణానగర్‌లో రోడ్డుపై ఏర్పాటు చేసిన మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్

సమతా దివస్ శుభాకాంక్షలు



మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని లోక్‌సభ మాజీ స్పీకర్, జగ్జీవన్ రామ్ కుమార్తె మీరాకుమార్ నివాసానికి వెళ్లి సమతా దివస్ శుభాకాంక్షలు తెలిపి, ఆమెను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ పీవీ రవిశేఖర్ రెడ్డి

- పంజాగుట్ట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి)

8న 'తెలుగు భాషకు పట్టాభిషేకం'

నల్లకుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా చైతన్య సమితి వార్షికోత్సవాన్ని ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బడేసాబ్ తెలిపారు. తెలుగు భాషకు పట్టాభిషేకం శీర్షికన నిర్వహించే ఈ వేడుకల్లో అంతర్జాతీయ కవి సమ్మేళనం, అంతర్జాతీయ తెలుగు భాషా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు శనివారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ చంద్రమౌళి, జయప్రకాష్, మహమ్మద్ అబ్దుల్ సాహిద్, సురేష్, ఎడ్ల కల్లేష్, జగన్, సత్యనారాయణ, మండల గురునాథం, పెబ్బేటి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మే 1న రవీంద్రభారతిలో శ్రమశక్తి అవార్డులను ప్రదానం చేస్తుందని కార్మికశాఖ జంట నగరాల సంయుక్త కమిషనర్, నోడల్ అధికారి సునీతాగోపాల్‌దాస్ తెలిపారు. కార్మిక రంగానికి విశిష్టమైన సేవలు అందిస్తున్న సంస్థలు, ట్రేడ్‌యూనియన్ లీడర్లు, కార్మికులు ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ముషీరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడకు చెందిన మహ్మద్ సమీద్(25), బోయిగూడకు చెందిన బి.కుషాల్ (25) నాగ్‌పూర్ నుంచి గంజాయి తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో వీరు ఆటోలో 1.2 కిలోల పొడిగంజాయిని తీసుకెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.గంజాయి తరలిస్తున్న ఆటోను సీజ్ చేశామని ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు.



సనత్‌నగర్ మోడల్ కాలనీలో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి పసుపు కొడుతున్న మహిళలు



శ్రీరామనవమి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తదితరులు

శ్రీరామనవమి వేడుకలకు ఘన ఏర్పాట్లు

బోరబండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలను ఎస్పీఆర్ హిల్స్ క్రీడాప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహిస్తామని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి వెల్లడించారు. రహ్మత్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో వివిధ బస్తీల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి వేడుకల పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం వేడుకల ఏర్పాట్లపై డివిజన్ నాయకులతో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్రీడా ప్రాంగణంలో వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ఎర్రగడ్డ డివిజన్ పరిధిలో..

ఎర్రగడ్డ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని పలు దేవాలయాలు శ్రీరామనవమికి ముస్తాబయ్యాయి. ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆలయాలు, కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదానం చేయనున్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించేందుకు నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

విజయలక్ష్మి దేవాలయంలో..

ఎర్రగడ్డలోని విజయలక్ష్మి దేవాలయంలో తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించిన శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం శ్రీరామ నవమితో ముగియనున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవాలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి తొమ్మిది రోజులపాటు సంపూర్ణ వాల్మీకి రామాయణంలోని తొమ్మిది కాండాల గురించి వివరించారు. నవరాత్రుల్లో భాగంగా శనివారం వాల్మీకి రామాయణంలో ప్రధాన ఘట్టమైన సుందరకాండ గురించి భక్తులకు వివరంగా చెప్పారు. వాల్మీకి సంపూర్ణ రామాయణంలో సుందరకాండ ప్రధానమైనదని.. సుందరకాండ అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎన్‌వీ రెడ్డి, మేనేజర్ మల్లేష్ పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తున్న మహంకాళి ఏసీపీ సైదయ్య

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

●వ్యాపారులకు మహంకాళి ఏసీపీ సైదయ్య సూచన

రాంగోపాల్‌పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తమ వ్యాపార సంస్థల ముందు తప్పని సరిగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని మహంకాళి ఏసీపీ సైదయ్య అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మహాత్మా గాంధీ రోడ్డులోని హర్డీ కాంప్లెక్స్‌లో వ్యాపారులకు సీసీటీవీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే ఏదైనా దొంగతనాలు, ఇతర నేరాలు జరిగినప్పుడు నిందితులను సులభంగా గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యాపారులంతా తమ షాపుల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురామ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణికులకు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి

రైళ్లలో ఆపద వస్తే 139కి కాల్ చేయండి

● ఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రైళ్లలో ప్రయాణం చేసే సమయంలో ఆపద వస్తే వెంటనే 139 నెంబర్‌కు కాల్ చేయాలని సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి రైలు ప్రయాణికులకు సూచించారు. సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సర్వనత్ ఆదేశాల మేరకు శనివారం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఎంఎంటీఎస్ రైళ్లలో ఆర్పీఎఫ్ పోలీసులు మహిళా కానిస్టేబుళ్లతో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణం చేసే సమయంలో తోటి ప్రయాణికుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏ సమయంలోనైనా మీకు ఆపద వస్తే వెంటనే 139 నెంబర్‌కు కాల్ చేస్తే వెంటనే మీ వద్దకు చేరుకుంటామని పేర్కొంటూ కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. మహిళా బోగిలో మహిళలు మాత్రమే ప్రయాణం చేయాలని, ఒక వేళ పురుషులు ఎక్కితే ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఖరీదైన వస్తువులతో ప్రయాణం చేసే సమయంలో లగేజీలను మీ వద్ద ఉంచుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

తిరుమలగిరి ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం 7వ వార్డు పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్ సమక్షంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో డయాబెటీస్, రక్తపోటు, థైరాయిడ్, మోకాళ్ల నొప్పులు, ఆస్తమా తదితర రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వార్డు-7 బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎర్రోళ్ల రుక్మయ్య, చిన్నన్న, ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ రాజా రెడ్డి, బీసీ విభాగం ఉపాధ్యక్షుడు ఉమేష్, నంద కుమార్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి!

● నేడు శ్రీరామ నవమి
● వేడుకలకు ముస్తాబైన ఆలయాలు

బౌద్ధనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు ఆలయాలు ఆదివారం జరిగే శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబయ్యాయి. సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి నవమి సందర్భంగా రామాలయాలతో పాటు వీరాంజనేయ స్వామి ఆలయాలను పూల దండలు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. పలు ఆలయాల ముందు పెద్ద పెద్ద చలువ పందిరిలు వేశారు. స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు



విద్యుత్ దీపాలతో అలంకరించిన సీతాఫల్‌మండిలోని రామలింగేశ్వర స్వామి ఆలయం



నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయం



రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద విద్యుత్ దీపాలతో రూపొందించిన అయోధ్య రామాలయం, శ్రీరాముడి సెట్టింగ్

ముత్యాల పందిళ్లలో

ఆలయాల్లో కొబ్బరి ఆకులు, ముత్యాలతో ఏర్పాటు చేసిన పందిరిల్లో మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ వేలాదిమంది భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించనున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు వడ పప్పు, పానకంను ప్రసాదంగా ఇవ్వనున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పలు ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వివిధ ఆలయాల్లో జరిగే కల్యాణానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ తదితర ప్రముఖులు హాజరు కానున్నారు.

● సీతాఫల్‌మండిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ నోముల ప్రకాశరావు ఆధ్వర్యంలో, చిలకలగూడలోని సాయిబాబా సమేత బాలాంజయనేయ స్వామి ఆలయంలో చైర్మన్ నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో, నామాలగుండు వీరాంజయనేయస్వామి ఆలయం, న్యూఅశోక్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి ఆలయం, చిలకలగూడలోని వీరాంజనేయస్వామి ఆలయం, ఉప్పరబస్తీలో సీతారామాంజనేయ యువజన సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు.

పహాడి హనుమాన్ ఆలయంలో...

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని 150 ఏళ్ల చరిత్ర గల పహాడి హనుమాన్ ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి 5 వేల మందికి పైగా భక్తులు వస్తుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ పరిరక్షణ కమిటీ చైర్మన్ నక్కా మధు, ఆలయ చైర్మన్ లక్ష్మణ్ ప్రసాద్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

షిరిడీ సాయిబాబా సంస్థాన్ ఆవరణలో..

మారేడుపల్లి : మహీంద్రాహిల్స్ రవి కాలనీలోని షిరిడీ సాయిబాబా సంస్థాన్ ఆవరణలో శ్రీరామ నవమి వేడుకలకు ఘనంగా ఏర్పాటు చేశామని ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 10.45 గంటలకు సీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తామని, అనం తరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణోత్సవానికి హాజరు కావాలని ఆయన కోరారు.

విజయాలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపు

●జాహ్నవి గ్రూప్ ఆఫ్ కాలేజీల చైర్మన్ పరమేశ్వర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : విజయాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని జాహ్నవి గ్రూప్ ఆఫ్ కాలేజీల చైర్మన్ పరమేశ్వర్, వైస్ చైర్మన్ లక్ష్మి అన్నారు. సికింద్రాబాద్‌లోని జాహ్నవి డిగ్రీ, పీజీ కాలేజ్ వార్షికోత్సవాన్ని కింగ్‌కోఠిలోని శాలిమార్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాహ్నవి కాలేజ్ విద్యార్థిని ధృతీ కేసరి ఐసీసీ యూ19 ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్-మలేషియా 2025 టోర్నమెంట్‌లో భారత జట్టులో భాగమై చాంపియన్‌షిప్ గెలిచిన సందర్భంగా కాలేజ్ తరఫున ఘనంగా సత్కరించారు. ఆమె విజయం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. జాహ్నవి కాలేజ్‌కే కాక తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమన్నారు. విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉదయ్, అనసూయ, కాలేజ్ ఫ్యాకల్టీ, ఉద్యోగులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ధృతి కేసరిని సత్కరిస్తున్న జాహ్నవి గ్రూప్ ఆఫ్ కాలేజీల చైర్మన్ పరమేశ్వర్, వైస్ చైర్మన్ లక్ష్మి

యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి బ్లాక్‌మెయిల్

●సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అరెస్టు చేసిన పోలీసులు

బౌద్ధనగర్, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): యువతిని పెళ్లి చేసుకుంటానని బ్లాక్ మెయిల్ చేసిన ఓవ్యక్తిని చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా బీటీఎస్ కాలనీకి చెందిన కొర్రా రాజా అలియాస్ రాజాచౌహాన్(34) ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ నాగోల్ బండ్లగూడలోని ఆనంద్‌నగర్‌లో నివసిస్తున్నాడు. చిలకలగూడకు చెందిన ఓ యువతి పెళ్లి సంబంధాల కోసం జీవన్‌సాథీ మ్యాట్రిమోని యాప్‌లో తన వివరాలు నమోదు చేసుకుంది. సదరు యువతి వివరాలు తెలుసుకున్న కొర్రా రాజా ఆమెను సంప్రదించాడు. తాను ఎలాంటి అందం, అలవాట్లు ఉండాలని కోరుకున్నానో అవన్నీ మీలో ఉన్నాయని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనకు సంబంధించిన వివరాలను ఆ యువతికి పంపించాడు. దీంతో ఆమె వివాహానికి అంగీకరించింది. మూడు నెలలు పాటు ఆమెతో చనువుగా ఉన్న రాజా వ్యక్తిగత వీడియోలు, ఫొటోలు సేకరించి బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. తాను మోసపోయానని గ్రహించిన యువతి అతడిని వదిలించేందుకు లక్షా 50 వేల రూపాయలు చెల్లించింది. వేధింపులు అధికంగా కావడంతో ఈనెల 1వ తేదీన చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తక్షణమే స్పందించిన పోలీసులు సాంకేతిక ఆధారాలు సేకరించి నిందితుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా తప్పు ఒప్పుకున్నాడు. పలు మ్యాట్రిమోనీ సైట్లలో నిందితుడు ఇదే తరహాలో వివరాలు సేకరించి పలువురిని మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌ను, పోలీసులను ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ జైపాల్‌రెడ్డి అభినందించి రివార్డులు అందజేశారు.



నిందితుడు కొర్రా రాజా



తిరిగి నాటిన చెట్టు వద్ద ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు తదితరులు

ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న చెట్టుకు స్థానచలనం

● ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది: ఏసీపీ శంకర్‌రాజు

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : చెట్టును తొలగించి వేరే చోట నాటడం (రీ లొకేట్) వల్ల చాలా వరకు ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని ఉత్తర మండల ట్రాఫిక్- 1 ఏసీపీ శంకర్ రాజు అన్నారు. శనివారం బాటా నుంచి ప్యాట్నీ చౌరస్తాకు వచ్చే దారిలో ఉన్న భారీ చెట్టును అక్కడి నుంచి వేర్లతో సహా జాగ్రత్తగా తొలగించి సమీపంలోని మహబూబ్ కాలేజ్‌లో తిరిగి నాటారు. ముందుగా శంకర్ రాజు చెట్టు వేర్లకు పూజ చేశారు. అనంతరం వేర్లు దెబ్బతినకుండా చెట్టును భూమిలోంచి జాగ్రత్తగా తొలగించి క్రేన్ సహాయంతో మహబూబ్ కాలేజ్ స్కూల్‌లో నాటారు ఈ సందర్భంగా శంకర్ రాజు మాట్లాడు తూ.. అధికారుల నుంచి అనుమతులు తీసుకున్న తర్వాతే.. ఈ చెట్టును స్థాన చలనం చేశామన్నారు. బాటా నుంచి ప్యాట్నీ వైపు వెళ్లే దారిలో ఉన్న ఈ చెట్టు ట్రాఫిక్‌కు అడ్డుగా ఉండడమే కాకుండా వాహనదారులపై కొమ్మలు పడుతూ ప్రమాదానికి కారణమవుతోందన్నారు. ఈ చెట్టు తిరిగి జీవం పోసుకునే వరకు కాపాడతామని, ప్రజల భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తాము ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమన్నారు.


నన్నే ఆపుతావా? నీ అంతు చూస్తా..

●ట్రాఫిక్ ఎస్ఐను బెదిరించిన యువకుడు
● కేసు నమోదు చేసిన పోలీసులు

బోయిన పల్లి, ఏప్రిల్5 (ఆంధ్ర జ్యోతి): విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐతో దురుసుగా ప్రవర్తించిన ఓ యువకుడిపై బోయినపల్లి పోలీసులు కేసును నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లారెడ్డి గార్డెన్ మూలమలుపులో శనివారం మధ్యాహ్నం బోయినపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ విజయ్‌కాంత్ తమ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో గాజుల రామారానికి చెందిన సాహెబ్(22) బుల్లెట్(టీజీ 08 సీ 9688) వాహనంపై శబ్దకాలుష్యం చేస్తూ వేగంగా వెళ్తున్నాడు. ట్రాఫిక్ పోలీసులు అతడిని ఆపి హెల్మెట్, లైసెన్స్‌ను అడిగారు. వాహనం నెంబర్ ప్లేట్ కనిపించకుండా దానిపై చుక్కలు పెట్టాడు. తనను ఆపినందుకు తీవ్ర ఆగ్రహానికి గురైన సాహెబ్.. ఎస్ఐ విజయ్‌కాంత్‌తో దురుసుగా ప్రవర్తించాడు. నీ అంతు చూస్తానని బెదిరించడంతో పాటు దుర్భాషలాడు. దీంతో ట్రాఫిక్ పోలీసులు అతడి వాహనాన్ని సీజ్ చేసి ట్రాఫిక్ పీఎస్‌కు తరలించారు. అనంతరం సాహెబ్‌పై బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సాహెబ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.



ఎస్ఐ విజయ్‌కాంత్‌ను బెదిరిస్తున్న యువకుడు



హేమ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధులు

రైల్వే అకౌంట్స్ పోస్టుల సరెండర్‌ను మానుకోవాలి

●ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధుల వినతి

చిలకలగూడ, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, అకౌంట్స్ విభాగంలోని పోస్టుల సరెండర్‌ను వెంటనే మానుకోవాలని ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధులు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ హేమ సునీతకు వినతిపత్రం అందజేశారు. పోస్టులను సరెండర్ చేయడం వల్ల మిగిలిన ఉద్యోగులపై పనిభారం పెరిగిపోతుందని, పదోన్నతుల అవకాశాలు తగ్గిపోతాయని ప్రతినిధులు అన్నారు. ఎవరినీ సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకు న్నారని, ఈ విషయంలో జనరల్ మేనేజర్, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ జోక్యం చేసుకొని తగు న్యాయం చేయాలని కోరారు. ఇలా ఉండగా, 366 పోస్టుల సరెండర్‌కు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించాలని నిర్ణయించినట్టు ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గడ్డం సత్యనారాయణ, మీడియా ప్రతినిధి షేక్ రఫూఫ్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

దళితుల అభ్యున్నతితో పాటు యావత్ సమాజాభివృద్ధికి పాటు పడిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని వక్తలు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను లష్కర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, దళిత, కార్మిక సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవల చిరస్మరణీయమని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.
(ఆంధ్రజ్యోతి, సికింద్రాబాద్/కంటోన్మెంట్/సనత్‌నగర్ జోన్ బృందం)



బన్సీలాల్‌పేట జబ్బార్ కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ కుర్మ హేమలత తదితరులు



బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన పీసీసీ కార్యదర్శి బొల్లు కిషన్ తదితరులు



బాలంరాయి చౌరస్తాలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద, మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి తదితరులు



కంటోన్మెంట్ పికెట్ చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్, గజ్జల నాగేష్ తదితరులు



సికింద్రాబాద్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగరాజు తదితరులు



బోయినపల్లిలో కేక్ కట్ చేస్తున్న జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్ తదితరులు



చాచా నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద.. కాంగ్రెస్ నాయకురాలు కోట నీలిమ, కాంగ్రెస్ నాయకులు



పార్శీగుట్ట ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో.. రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నరేష్ మాదిగ, ఎంఎస్‌పీ హైదరాబాద్ ఇన్‌చార్జి డప్పు మల్లికార్జున్ తదితరులు



బొల్లారం అంబేద్కర్‌నగర్‌లో.. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నర్సింహన్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తదితరులు



సీతాఫల్‌మండిలో నివాళులర్పిస్తున్న టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు జీపీ కృష్ణ తదితరులు



సీతాఫల్‌మండిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సామల హేమ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు